క్లుప్తంగా

నేడు షాపులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం షాపులకు సెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వ్యాపారస్తులందరూ తమ దుకాణాలను మూసివేయవేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని వ్యాపారులందరూ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని కోరారు.

16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సీటీఆర్ఐ: స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమంలోని గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో ఈ నెల 16 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభమవుతాయని ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి అన్నారు. ఆయన బుధవారం ఆశ్రమంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 26 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజు బాలకృష్ణుల వేషధారణ, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఉంటాయని, పాల్గొనే 18 నుంచి 25వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

తిరంగా.. ఘనంగా..


రాజమహేంద్రవరంలో బెలూన్లు ఎగురవేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


కడియంలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ప్రభుత్వ సిబ్బంది


ధవళేశ్వరంలో పాదయాత్ర చేస్తున్న సోము వీర్రాజు తదితరులు

- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు
- మువ్వన్నెల జెండా రెపరెపలు

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్య వేడుకలలో భాగంగా బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీలు ఘనంగా నిర్వహించారు. మువ్వెన్నల జెండాలతో వీధులన్నీ కళకళలాడాయి. ఇందులో భాగంగా ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో పుష్కరాల రేవు నుంచి గోదావరి గట్టున ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జాతీయ సమైక్యతను సమగ్రతను కాపాడటం మనందరి బాధ్యతన్నారు.

బొమ్మూరులో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి బొమ్మూరు వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ పితాని సత్యనారాయణరాజు, వైస్ చైర్మన్ పల్లెడి పార్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలో హైస్కూలు విద్యార్థులు, క్రీడాకారులు, రెడ్‌క్రాస్ విద్యార్థులు, రెవెన్యూ, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, ఎంపీడీవో జి.రాజీమనోజ్, తహసీల్దార్ కె.పోసిబాబు, హెచ్ఎం. టి.సత్యనారాయణ పాల్గొన్నారు. దుళ్ల గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ధవళేశ్వరం జూనియర్ కళాశాల నుంచి సాయిబాబా గుడి వరకూ ఈ కార్యక్రమం జరిగింది. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసారు.


దుళ్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


ధవళేశ్వరంలో భారీ జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

జెండా పండగకు సర్వం సిద్ధం

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఇందులో భాగంగా ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో చేసిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పరిశీలించారు. ముఖ్యంగా పేరెడ్ రిహార్సల్స్‌ను పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేస్తారన్నారు. వేడుకలకు వచ్చే అతిథుల కోసం సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకూ వేడుకలు నిర్వహిస్తామని వెల్లడించారు. తొమ్మిది శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఎస్పీ నరసింహా కిషోర్ మాట్లాడుతూ సభా ప్రాంగణంలో వీఐపీలకు, ప్రజలకు ప్రవేశ మార్గాలు వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


రిహార్సల్స్‌లో పోలీసుల వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్

సత్యదేవ నర్సరీలో..

కడియం: కడియపులంకలోని పుల్లా చంటియ్య సత్యదేవ నర్సరీలో స్వాతంత్ర్య దినోత్సవ మొక్కల కూర్పును బుధవారం ఏర్పాటు చేశారు. హర్ ఘర్ తిరంగా అంటూ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపును ప్రతిబింభించే విధంగా ఈ మొక్కల కూర్పు ఏర్పాటు చేసినట్లు నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ తెలిపారు.


సత్యదేవ నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు

ఎట్టకేలకు బయటకొచ్చిన ఇసుక బోటు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ గేట్ల వద్దకు కొట్టుకు వచ్చి మునిగిపోయిన ఇసుక బోటును బుధవారం సాయంత్రం ఎట్టకేలకు బయటకు తీశారు. గత నెల 20వ తేది రాత్రి వరద నీటి ఉధృతికి ఇసుక బోటు కాటన్ బ్యారేజ్ ఒకటవ నెంబర్ గేటు వద్ద కొట్టుకువచ్చింది. బోటును అప్పట్లో తీసేందుకు ప్రయత్నించినప్పటికీ వరద నేపథ్యంలో సాధ్యం కాలేదు. అనంతరం నీటి ఉధృతి భారీగా పెరగడంతో బోటును అక్కడే వదిలేశారు. రెండుసార్లు భారీ క్రేన్లను తీసుకువచ్చి బోటును బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. భారీ క్రేన్ల వల్ల బ్యారేజ్‌కు నష్టం కలిగే ప్రమాదం పొంచి ఉందని ఇరిగేషన్ అధికారులు పనులను నిలిపివేశారు. బోటు యజమాని బోటులో పేరుకుపోయిన పూడికను గజ ఈతగాళ్ల సాయంతో తొలగించారు. రోప్‌లను కిందకు దించి కప్పిల సాయంతో బోటును బయటకు తీశారు. ఎస్ఈ జి శ్రీనివాసరావు, ఈఈ కాశీ విశ్వేరరావు, డీఈ రమేష్, ఏఈ అద్దంకి సాయిరామ్ బోటును బయటకు తీసే పనులను పర్యవేక్షించారు.


బయటకు వచ్చిన ఇసుక బోటు

ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు బెనర్జీ మృతి

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం పూర్వపు ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకుడు ఎంఏఎఫ్ బెనర్జీ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మూడు దశాబ్దాలు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. హుకుంపేట ఆదర్శనగర్‌లోని స్వగృహం వద్ద బెనర్జీ పార్థివ దేహానికి ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్ నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలను గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలోని 20 శాఖా కార్యాలయాల్లో బెనర్జీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎల్ఐసీ మోరంపూడి డివిజన్ ఆఫీసులో జరిగిన సమావేశంలో బెనర్జీ మృతిపై ఉద్యోగులు సంతాపం తెలిపారు.


ఎంఏఎఫ్ బెనర్జీ (ఫైల్)

వైద్యురాలి హత్యకు నిరసన

కంబాలచెరువు: పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ రాజమహేంద్రవరం జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ వైద్యులు బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. దోషులను శిక్షించడంతో పాటు డాక్టర్లు, వైద్య సిబ్బంది భద్రత కోసం చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామపంచాయతీల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈపీఆర్అండ్ఆర్డీ డి.బాబూరావు అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాబూరావు ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, వీధిలైట్ల నిర్వహణ, తాగునీరు, పారిశుధ్యం మెరుగు, గ్రామాభివృద్ధికి ప్రణాళికల తయారీ, ఇంటి పన్నుల వసూలు తదితర అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

ధవళేశ్వరం: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ముత్తూట్ ఫిన్‌కార్ప్ సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డ్రీమ్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. తురంగి ప్రవల్లిక ప్రథమ గండికోట మంజుల ద్వితీయ, వేగి జోష్ నాయుడు తృతయ స్థానాలలో నిలిచారు. గట్టి స్వాతి, పాతూరి సాహితి నాగవాణి, సమనస విజయ, కట్టా ధనుష్, వాసంశెట్టి వనితశ్రీ, సమనస ఆదిచర్చిత, షేక్ షంషుద్దీన్ ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. వీరందరికీ ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రతినిధులు బహుమతులను ప్రదానం చేశారు.

చిత్ర సందేశం

కడియం: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని దేశంలోని బాలికల భవిష్యత్తుకు భరతమాత స్ఫూర్తితో భరోసానివ్వాలని కోరుతూ దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్.రాంబాబు ఓ చిత్రాన్ని రూపొందించారు. ధాన్యం గింజలతో భారతదేశం చిత్రపటాన్ని తయారు చేశారు. బాలికలపై అత్యాచారం చేస్తున్న వ్యక్తిని భరతమాత శూలంతో గుచ్చుతున్న విధంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ భవిష్యత్తుకు ఆధారమైన చిన్నారులను కాపాడుకోవాలన్న సందేశాన్నిస్తూ ఈ చిత్రాన్ని రూపొందించినట్లు రాంబాబు తెలిపారు.


రాంబాబు రూపొందించిన చిత్రం

పుష్కర భక్తులకు అన్ని సౌకర్యాలు

రాజమహేంద్రవరం సిటీ: 2027లో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరం వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడం కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఆమె బుధవారం ప్రధాన, గోదావరి రైల్వే స్టేషన్ల పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో కలసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ పుణ్యస్నానాలకు రైళ్లలో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో డీఆర్ఎం పర్యటనలో రైల్వే స్టేషన్లలో కల్పించాల్సిన సౌకర్యాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు.

విజయాలు కొనసాగాలి



పల్ల వెంకన్న నర్సరీలో ఆకట్టుకుంటున్న మొక్కల కూర్పు

కడియం: ఒలింపిక్స్‌లో భారత్ క్రీడాకారులు సాధించిన విజయాల మాదిరిగానే దేశం అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని కోరుకుంటూ కడియంలోని పల్ల వెంకన్న నర్సరీలో మొక్కల కూర్పు ఏర్పాటు చేశారు. వివిధ రకాల మొక్కలతో ఒలింపిక్స్‌లో జాతీయ పతాకాన్ని ధరించిన క్రీడాకారుడి చిత్రాన్ని రూపొందించినట్లు నర్సరీ అధినేతలు పల్ల సత్యనారాయణ, వెంకటేష్, వినయ్ తెలిపారు. గ్లోరీ ఇండియా పేరిట ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు ఎంతో ఆకట్టుకుంటోంది.

భవిత ఉపకేంద్రం సందర్శన

కంబాలచెరువు: విభిన్న ప్రతిభావంతులు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి అండగా నిలబడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు అన్నారు. తాడితోటలోని భవిత ఉపకేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడి ఆహార ప్రమాణాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కృషి

కంబాలచెరువు: నగరంలో రోజురోజుకీ పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన ట్రాఫిక్ హెల్మెట్లు, రేడియం జాకెట్లు, బ్యాటన్‌లను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, డీఎస్పీ (ట్రాఫిక్) ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


సిబ్బందికి ట్రాఫిక్ హెల్మెట్, రేడియం జాకెట్, బ్యాటన్‌లను అందజేస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్